క్లుప్తంగా

వీరన్న సన్నిధిలో పూజలు

కురవి : మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి వారిని బీఆర్‌ఎస్ యూత్ రాష్ట్ర కార్యదర్శి బొల్లికొండ వీరేందర్ మంగళవారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆయన వెంట ఆలయ చైర్మన్ బాదావత్ రామునాయక్, నాయకులు తోట లాలయ్య, దరావత్ భాస్కర్ నాయక్, గుగులోత్ దేవోజీనాయక్, గుదె వీరన్న, గాలి శివ, బుర్ర జగదీశ్ ఉన్నారు.

కేసీఆర్‌తోనే దేశం అభివృద్ధి

నెల్లికుదురు : దేశం అభివృద్ధి సీఎం కేసీఆర్ తోనే సాధ్యమని జెడ్పీటీసీ మేకపోతుల శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలోని శ్రీరామగిరిలో కాంగ్రెస్ నాయకులు, వార్డు సభ్యులు మాదరి ప్రశాంత్‌తో పాటు 40 కుటుంబాలు బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పరుపాటి వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం పార్టీలో చేరారు. వారికి జెడ్పీటీసీ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి వెన్నాకుల శ్రీనివాస్, నాయకులు యాసం రమేష్, వైస్‌ఎంపీపీ జెల్ల వెంకటేష్, ఎంపీటీసీ సుభాషిణి, తదితరులు పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి

కేసముద్రం : కేసముద్రం నుంచి తొర్రూరు, గూడూరు వైపుకు ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని కల్పించాలంటూ మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో ఎంసీపీఐ ఆధ్వర్యంలో వినతిపత్రాలు అందచేశారు. ప్రభుత్వం వేల కోట్లు రూపాయలు వెచ్చించి తారురోడ్లు వేసినప్పటికీ ఆ రోడ్లపై ప్రయాణించేందుకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు బిచ్చానాయక్, భద్రమ్మ, రేవతి, మల్లయ్య, లక్ష్మణ్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ మండల మీడియా ఇన్‌చార్జ్‌గా రామచంద్రు

నెల్లికుదురు : మహబూబాబాద్ ఎమ్మెల్యే బానోతు శంకర్‌నాయక్ ఆదేశాలతో బీఆర్‌ఎస్ మండల మీడియా ఇన్‌చార్జ్‌గా మండల కేంద్రానికి చెందిన పులి రామచంద్రును నియమించినట్లు పార్టీ మండల అధ్యక్షుడు పరుపాటి వెంకట్‌రెడ్డి మంగళవారం వెల్లడించారు. ఈ విషయాన్ని స్థానిక విలేకరుల సమావేశంలో ఆయన తెలిపారు.

బహుమతులు అందజేత

నెల్లికుదురు: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఈ నెల 15, 16 తేదీల్లో మండలంలోని నైనాలలో జగన్నాథం జ్ఞాపకార్థం జగన్నాథం మెమోరియల్ యువజన సంఘం ఆధ్వర్యంలో పలు సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలో మంగళవారం బహుమతుల ప్రదానోత్సవ కార్యాక్రమంలో ముగ్గుల పోటీలు, సంస్కృతిక కార్యక్రమాల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో రామరాజు, నర్సయ్య, యాకయ్య, శ్రీను, యాకూబ్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

మండల డెకరేషన్, లైటింగ్ సంఘం కమిటీ ఎన్నిక

తొర్రూరు: మండల డెకరేషన్, లైటింగ్ సంఘం నూతన కమిటీని మంగళవారం డివిజన్ కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జలగం శంకర్, కార్యదర్శిగా ఎండీ.నదీమ్, ఉపాధ్యక్షులుగా బొమ్మగాని గణేష్, కోశాధికారిగా మడత ఉమేష్, సంయుక్త కార్యదర్శిగా ఆంగోతు రమేష్‌తో పాటు కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. నూతన అధ్యక్షుడు శంకర్ మాట్లాడుతూ అన్ని శుభకార్యాల్లో లైటింగ్, డెకరేషన్ ప్రముఖ పాత్ర పోషిస్తుందన్నారు. కార్యక్రమంలో గౌరవ సలహాదారుడు వనపర్తి సమ్మయ్య, గౌరవ అధ్యక్షుడు మిట్టకోట లక్ష్మణ్ పాల్గొన్నారు.

యాదవ సంఘం కమ్యూనిటీ హాల్ మంజూరు చేయాలి

మరిపెడ రూరల్ : మండలంలోని తాళ్ల ఊకల్ లో యాదవ కమ్యూనిటీ హాల్ మంజూరు చేయాలని మంత్రి దయాకర్‌రావుకు వినతిపత్రం సమర్పించారు. మంగళవారం తాళ్లఊకల్ గ్రామంలో ఓ కార్యక్రమానికి మంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా యాదవ సంఘం నాయకులు గ్రామంలో కమ్యూనిటీ హాల్ మంజూరు చేయాలని కోరుతూ మంత్రికి వినతిపత్రం అందజేశారు. మంత్రిని కలిసిన వారిలో యాదవ సంఘం నాయకులు మట్టిపల్లి వెంకట్, బోర గంగయ్య, వీరబోయిన సందీప్, కోశబోయిన రమేష్, శ్రీకాంత్ ఉన్నారు.

గెలుపే లక్ష్యంగా పని చేయాలి

పెద్దవంగర: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పని చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముద్దసాని సురేష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని అన్నారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు 26న ప్రతి గ్రామంలో జెండా ఆవిష్కరించి పాదయాత్రకు మద్దతు తెలుపాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు హరికృష్ణ, దాసరి శ్రీనివాస్, సీతారాంనాయక్, ఎండి పాషా, ముత్యాల పూర్ణచందర్, వేణు, సతీష్, సోమన్న, రాంబాబు, వెంకన్న, రవి, రఘు, రమేష్, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ సభను విజయవంతం చేయాలి

- టీఎస్ ఎంఎస్ఐడీసీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్

గార్ల : ఖమ్మంలో బుధవారం నిర్వహించ తలపెట్టిన బీఆర్‌ఎస్ బహిరంగ సభను విజయవంతం చేయాలని టీఎస్ ఎంఎస్ఐడీసీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, మహబూబాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ ఆంగోత్ బిందు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానికంగా ఏర్పాటు చేసిన బీఆర్‌ఎస్ నాయకుల విస్తృతస్థాయి సమావేశంలో వారు పాల్గొని మాట్లాడుతూ పార్టీ బహిరంగ సభకు మండలం నుంచి వేలాదిగా తరలించేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు సమష్టిగా కృషి చేయాలని కోరారు. గార్ల మండలం నుంచి 10 వేల మందిని సభకు తరలించేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు వారు పేర్కొన్నారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు గంగావత్ లక్ష్మణ్‌నాయక్, కార్యదర్శి పి.రాధాకృష్ణ, సర్పంచ్‌లు అజ్మీర బన్సీలాల్, ధరావత్ సక్రు, ఎంపీటీసీ శీలంశెట్టి రమేష్, కోఆప్షన్ ఎండీ.ఖదీర్, ఎం భాస్కర్, లింగాల ఉమేష్, గాజుల గణేష్, రావూజీ, పాల్గొన్నారు.

దంతాలపల్లి : ఖమ్మంలో జరుగబోయే ముఖ్యమంత్రి బహిరంగ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే రెడ్యానాయక్ పిలుపునిచ్చారు. మండలంలోని గున్నెపల్లిలో మంగళవారం ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామంలోని ముఖ్య నాయకులు వారి గ్రామాల నుంచి అధిక సంఖ్యలో కార్యకర్తలను తీసకువచ్చి విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ధర్మారపు వేణు, మండల ఇన్‌చార్జ్ యాదవరెడ్డి, జెడ్పీటీసీ వెంకటేశ్వరరెడ్డి, సహకారసంఘం చైర్మన్, సంపెట రాము, రైతు సమితి మండల కోఆర్డినేటర్ మల్లారెడ్డి, మధుకర్‌రెడ్డి పాల్గొన్నారు.

నర్సింహులపేట : ఖమ్మంలో బుధవారం జరుగబోయే బీఆర్‌ఎస్ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే రెడ్యానాయక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో అయన విలేకరులతో మాట్లాడుతూ బహిరంగ సభకు భారీగా తరలివెళ్లి సభను విజయవంతం చేయాలని కార్యకర్తలకు సూచించారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు యాదగిరిరెడ్డి, దామోదర్‌రెడ్డి, దేవేందర్, సత్తిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.


గార్ల : సమావేశంలో మాట్లాడుతున్న ఎర్రోళ్ల శ్రీనివాస్

మిరపతోటలో సర్పంచ్ ప్రచారం

కురవి: ఖమ్మంలో బుధవారం జరగబోయే బీఆర్‌ఎస్ బహిరంగ సభకు తరలిరావాలని కోరుతూ మండలంలోని బలపాల శివారు లింగ్యాతండా గ్రామ సర్పంచ్ గుగులోత్ రాంలాల్‌నాయక్ మంగళవారం మిరపతోటకు వెళ్లి ప్రచారం నిర్వహించారు. బహిరంగ సభకు వచ్చి కేసీఆర్‌ను దీవించాలని కోరారు.

చరిత్రాత్మకం కానున్న సభ

పెద్దవంగర: ఖమ్మంలో బుధవారం నిర్వహించనున్న బీఆర్‌ఎస్ ఆవిర్భావ సభ చరిత్రాత్మకం కానుందని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ వెనుకదాసుల రామచంద్రయ్య శర్మ అన్నారు. మంగళవారం మండలంలోని ఉప్పరగూడెంతో పాటు పలు తండాల్లో బహిరంగ సభ కోసం జనసమీకరణపై సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి శ్రీరాం సంజయ్, సర్పంచ్ దుంపల జమున సమ్మయ్య, నాయకులు రాజు, శరబొద్దీన్, సోంమల్లు, పరశురాం, మహేందర్, పాల్గొన్నారు.


దంతాలపల్లి : మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్యా

చిన్నగూడూరు : ఖమ్మం జరిగే బీఆర్‌ఎస్ బహిరంగ సభను విజయవంతం చేయాలని రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ వాసుదేవరెడ్డి బీఆర్‌ఎస్ జిల్లా యువనాయకులు రవిచంద్ర తెలిపారు. మంగళవారం మండలకేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో బహిరంగ సభ సన్నాహక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు వల్లూరి వెంకటరెడ్డి,రాంసింగ్,మురళిధర్‌రెడ్డి, మంగపతిరావు, చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘రేషన్’లో పోర్టిఫైడ్ బియ్యం


రేషన్ బియ్యంలో వచ్చిన పోర్టిఫైడ్ బియ్యం

గార్ల : రేషన్ బియ్యంలో ప్లాస్టిక్ బియ్యం కలిపి వస్తున్నాయని ఈ బియ్యం వండుకుంటే అనారోగ్యం పాలవుతామని మహిళలు ఆందోళన చెందుతున్నారు. మంగళవారం మండలంలోని ఎరుకలవాడలో పిండివంటలు చేసుకునేందుకు మహిళలు రేషన్ బియ్యంను కడిగి ఆరుబయట ఎండబెట్టగా బియ్యంలో ప్లాస్టిక్ బియ్యం కనిపించాయి. ఆమె తోటి మహిళలకు చెప్పడంతో వారు ఆందోళన చెందారు. ఇక నుంచి రేషన్ బియ్యం తినకూడదని, తింటే అనారోగ్యాల పాలవుతామని మహిళలు పేర్కొంటున్నారు. ఈ విషయంపై జిల్లా సివిల్ సప్‌లై డీటీ నారాయణరెడ్డిని సాక్షి వివరణ కోరగా ప్రజా పంపిణీ వ్యవస్థలో భాగంగా రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేస్తున్న బియ్యంలో ఐరన్, ఫోలిక్‌యాసిడ్, విటమిన్ బి–12 వంటి పోషకాలతో కూడిన ఫోర్టిఫైడ్ బియ్యంను క్వింటా రేషన్ బియ్యంలో 1 కేజీ పోషకాల మిలితమైన బియ్యం కలిపి సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. మహిళలు రేషన్ బియ్యంపై ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

వైభవంగా ఎల్లమ్మ జాతర

గూడూరు : మండలంలోని మచ్చర్ల శివారు దేవుడి గుట్ట కింద ఎల్లమ్మతల్లి జాతర మంగళవారం వైభవంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం సంక్రాంతి మొదలు మూడు రోజులు దేవుడిగుట్టపై మల్లికార్జునస్వామి జాతర మొదలై పట్నాలు, బోనాలు, కల్యాణ వేడుకలను నిర్వహిస్తారు.గుట్టకింద వెలసిన ఎల్లమ్మతల్లి దేవాలయం వద్ద యాదవ సంఘం నిర్వాహకులు పెద్దపట్నం వేసి ఒగ్గు కథలు చెపుతారు. భక్తులు తన్మయంతో పొర్లుదండాలు పెడుతూ తల్లిని వేడుకుంటారు. అనంతరం ఎల్లమ్మతల్లి బోనాలు ఎత్తుకొని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి, తల్లికి నైవేద్యాలు సమర్పించుకున్నారు. యాదవ సంఘం పెద్దలు నర్సయ్య, లింగ య్య, మల్లేష్‌యాదవ్, విమలాకర్, ఏర్పాట్లు చేశారు.

సంక్షిప్త సమాచారం

దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలి



మహబూబాబాద్ : దళిత ఉపాధ్యాయుడు మల్లికార్జున్‌పై దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజు డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజామాబాద్ జిల్లాలోని కోటగిరిలో మల్లికార్జున్‌ను కులంపేరుతో దూషించారన్నారు. దళితుల ఆత్మగౌరవాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత కార్మికవర్గంపై ఉందన్నారు.

వెంకటమ్మకు ఘననివాళి



మరిపెడ రూరల్ : మండలంలోని తాళ్లఊకల్‌కు చెందిన బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కొంపెల్లి శ్రీనివాస్‌రెడ్డి తల్లి వెంకటమ్మ ప్రథమ వర్ధంతికి గిరిజన స్త్రీ, శిశు, సంక్షేమ శాఖ మంత్రి సత్యవతిరాథోడ్ మంగళవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా వెంకటమ్మ చిత్రపటం వద్ద మంత్రి నివాళులర్పించారు. ఆమె వెంట బీఆర్‌ఎస్ నాయకులు బండి వెంకట్‌రెడ్డి, కొమ్మినేని రవీందర్, అంబరీష, రాము, వేణుగోపాల్‌రెడ్డి ఉన్నారు.

వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



కొత్తగూడ : గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న డెయిలీవేజ్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు శ్రీశైలం కోరారు. స్థానిక ఏటీడీఓ కార్యాలయం ఎదుట చేస్తున్న నిరవధిక సమ్మెకు న్యూడెమోక్రసీ పార్టీ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా శ్రీశైలం మాట్లాడుతూ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు.

సమస్యలు పరిష్కరించేంత వరకు సమ్మె

గూడూరు : యాజమాన్యం తమ సమస్యలు పరిష్కరించేంత వరకు నిరసన సమ్మె కొనసాగిస్తామని కార్మికులు శ్రీనివాస్, మల్లేషం అన్నారు. మండలంలోని తీగలవేణి మిడ్‌వెస్ట్ గ్రానైట్ క్వారీలో సమస్యల సాధన కోసం చేపట్టిన కార్మికుల నిరసన సమ్మె మంగళవారం రెండోరోజు కొనసాగింది. కార్యక్రమంలో గ్రానైట్ కిందిస్థాయి కార్మికులు 20 మంది పాల్గొన్నారు.

తైబందీపై నేడు సమావేశం

గార్ల: స్థానిక పెద్దచెరువులో నీటి నిల్వ ఉన్నందున రబీలో వరిపంట సాగు చేసుకునేందుకు తైబందీ నిర్ణయించేందుకు బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో రైతులతో సమావేశం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ రాము మంగళవారం తెలిపారు. సమావేశం మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమవుతుందని ఆయకట్టు రైతులు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

అమరుల స్ఫూర్తితో ఉద్యమించాలి



కురవి : మండల మాజీ సీపీఐ కార్యదర్శి దివంగత ఎస్.సురేంద్రకుమార్(సూరి) స్ఫూర్తితో ఉద్యమించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో సూరి ప్రథమ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ చిన్నతనం నుంచే కమ్యూనిస్టు పార్టీలో పనిచేసి నిబద్ధత కలిగి కార్యకర్తగా ఉద్యమాలు చేసిన గొప్ప వ్యక్తి సూరి అని కొనియాడారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కర్నం రాజన్న, నాయకులు తురక రమేష్, కన్నె వెంకన్న, బొల్లం ఉప్పలయ్య, దూదికట్ల సారయ్య, కలగూర నాగరాజు పాల్గొన్నారు.

పాఠశాల ఆవరణలో మద్యం బాటిళ్లు

నర్సింహులపేట: స్థానిక ప్రాథమికోన్నత పాఠశాల ప్రాంగణం మందు బాబులకు నిలయంగా మారింది. ఎంపీడీఓ కార్యాలయానికి ఎదురుగా పోలీస్‌స్టేషన్‌కు సమీపంలో ప్రధాన రహదారి పక్కన ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలలో మద్యం బాటిళ్లు మంగళవారం దర్శనమిచ్చాయి. పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో రహదారి పక్క నుంచి మద్యంప్రియులు సేవించడానికి వెళ్తున్నట్లు తెలుస్తోంది. పోలీసులు తనిఖీలు చేసి పాఠశాలలో ఇలాంటి ఘటనలు జరగకుండా చూడాలని ప్రజలు, యువకులు డిమాండ్ చేశారు.

ఛత్రపతి శివాజీ కమిటీ ఎన్నిక


రమేష్, అధ్యక్షుడు


దశరథ, కార్యదర్శి

మరిపెడ రూరల్: మండలంలోని ఎల్లంపేటలో ఛత్రపతి శివాజీ యూత్ నూతన కమిటీని సభ్యుల ఆధ్వర్యంలో మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అలువాల రమేష్, ప్రధాన కార్యదర్శిగా గుండా దశరథ, ఉపాధ్యక్షులుగా అవుల గోపి, దండే బుచ్చి రాములు, కోశాధికారిగా బత్తెం అశోక్, సభ్యులుగా ఉమేష్, మహేష్, సాయిబాబు, రాజు, యాకన్న, వినయ్ తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు.

‘కంటి వెలుగు’ పేదలకు వరం


తొర్రూరు: కరపత్రాలు పంచి ప్రచారం నిర్వహిస్తున్న మున్సిపల్ కమిషనర్, సిబ్బంది


నెల్లికుదురు : కంటివెలుగు శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ శేషాద్రి

తొర్రూరు: నేత్ర సమస్యలతో బాధపడుతున్న పేదలకు కంటివెలుగు కార్యక్రమం వరమని మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, కమిషనర్ సింగారపు కుమార్ అన్నారు. మంగళవారం డివిజన్ కేంద్రంలోని 1వ వార్డులో కంటివెలుగు కార్యక్రమంపై మున్సిపాలిటీ సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ నెల 19 నుంచి పట్టణంలోని 16 వార్డుల్లో కంటివెలుగు శిబిరం కొనసాగుతుందన్నారు. స్థానికులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ జినుగ సురేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు భూసాని రాము, కొలుపుల శంకర్, ఏఈ రంజిత్, పాల్గొన్నారు.

చిన్నగూడూరు : గ్రామాల్లో నిర్వహించే కంటివెలుగు వైద్య శిబిరాలను విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్ అభిలాషా అభినవ్ అన్నారు. మండలకేంద్రంలో ఆరోగ్య ఉపకేంద్రాన్ని మంగళవారం ఆయన అకస్మికంగా తనిఖీ చేశారు. ఏర్పాట్లపై వైద్యులు, సిబ్బందికి తగిన సూచనలు చేశారు. ఆరోగ్య ఉప కేంద్రం పరిసరాల్లో శానిటేషన్ పనుల నిర్లక్ష్యం చేసిన కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలను సత్వరమే వాడుకలోకి తీసుకురావాలన్నారు. ఆయన వెంట రామకృష్ణ, ఎంపీడీఓ శ్యాంసుందర్, వైద్యులు ఉన్నారు.

నెల్లికుదురు : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ శేశాద్రి కోరారు. మండలంలోని లక్ష్మీపురం, సీతారాపురం, నెల్లికుదురు గ్రామాల్లో ఈ నెల 19 నుంచి ప్రారంభించే కంటివెలుగు సెంటర్లను ఎంపీఓ పార్థసారధితో కలిసి మంగళవారం పరిశీలించారు. వారి వెంట పంచాయతీ కార్యదర్శి, వైద్యసిబ్బంది ఉన్నారు.

ముదిరాజ్‌లు హక్కుల కోసం ఉద్యమించాలి


మాట్లాడుతున్న గొడుగు శ్రీనివాస్

గూడూరు: చేపల పెంపకంతో జీవనం గడిపే ముదిరాజ్ కులస్తులు హక్కుల కోసం ఉద్యమించాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి, జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యుడు గొడుగు శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం మండల ముదిరాజ్ కులసంఘం అధ్యక్షుడు పాండవుల మల్లయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. 1964లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం ముదిరాజ్ కులస్తులు మత్స్యకార్మికులుగా ఉన్నారన్నారు. మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల రక్షణ కోసం రాష్ట్ర సంఘం అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బండా ప్రకాష్ ఆదేశం మేరకు ముదిరాజ్‌ల వృత్తి రక్షణ చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ఇందులో భాగంగా గూడూరులో ఈ నెల 19న జరిగే మత్స్య కార్మికుల వృత్తి రక్షణ భారీ ర్యాలీకి జిల్లాలోని గార్ల, బయ్యారం, కొత్తగూడ, గూడూరు మండలాల్లోని ముదిరాజ్‌లు అధిక సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. మల్లయ్య, అశోక్, సదానందం, రాజ్‌కుమార్, జంపయ్య, వెంకన్న, కుమారస్వామి పాల్గొన్నారు.

కారు, ఆటో ఢీ : నలుగురికి గాయాలు


కారు, ఆటో ఢీకొన్న దృశ్యం

కురవి : ఒకే మార్గంలో వస్తున్న కారు ఆటోను ఢీకొనడంతో నలుగురికి గాయాలైన సంఘటన కురవి శివారు లింగ్యాతండా జీపీ పరిధిలోని మూడుగుడిసెల తండా వద్ద జాతీయ రహదారిపై మంగళవారం చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం..మహబూబాబాద్ నుంచి ఆటో కురవి వైపు వస్తుండగా, అదే మార్గంలో మహబూబాబాద్ నుంచి కురవి మీదుగా ఖమ్మం బహిరంగ సభకు బందోబస్తు కోసం పెద్దపల్లి జిల్లాకు చెందిన పోలీసులు కారులో బయలుదేరారు. ఈ క్రమంలో మూడు గుడిసెల తండా వద్ద రోడ్డు పక్కన పండ్లు అమ్మకాలు చేస్తున్న వైపు ఒక్కసారిగా ఆటో రావడంతో వెనుక నుంచి వస్తున్న కారు ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న సీరోలు మండలం చిలుకోయలపాడుకు చెందిన జరుపుల సురేష్, ఎస్.నసీస్, కొప్పుల కీర్తీ, ఉపేంద్రలకు గాయాలయ్యాయి. ఈ క్రమంలో అటు వైపుగా వస్తున్న బీజేపీ రాష్ట్ర నాయకుడు హుస్సేన్ నాయక్ సంఘటన స్థలానికి వచ్చి బాధితులను మహబూబాబాద్ జనరల్ ఆసుపత్రికి తన వా హనంలో ఎక్కించి తరలించారు. బాధితులు ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.

పేద బిడ్డల విద్యకు చేయూత అవసరం


ఆర్థికసాయం అందజేస్తున్న శ్రీనివాస్

తొర్రూరు : పేదబిడ్డల విద్యకు చేయూత అవసరమని జెడ్పీఫ్లోర్ లీడర్ మంగళపల్లి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని చెర్లపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10 జీపీఏ సాధించిన ఎండీ.సమీరాకు మంగళవారం గ్రామంలో శ్రీనివాస్ రూ.5 వేల ప్రోత్సాహకం అందించారు. యూకేలో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న కుమారుడు వాసే జన్మదినం సందర్భంగా శ్రీనివాస్ ఆర్థికసాయం అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేదింటి బిడ్డలు మట్టిలో మాణిక్యాలన్నారు. కార్యక్రమంలో లింగాలఘనపురం జెడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పసుమర్తి సీతారాములు, సర్పంచ్ సట్ల నాగలక్ష్మీ, బీఆర్‌ఎస్ మండల కోఆర్డినేటర్ అనుమాండ్ల దేవేందర్‌రెడ్డి, ఎంపీటీసీ ధర్మారపు కిరణ్, రాయిశెట్టి వెంకన్న పాల్గొన్నారు.

తెలంగాణలో బీజేపీదే అధికారం


బీజేపీ జెండా ఎగురవేసిన హుస్సేన్‌నాయక్

గూడూరు : రానున్న ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ జెండా ఎగరడం ఖాయమని పార్టీ గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జాటోతు హుస్సేన్‌నాయక్ అన్నారు. గూడూరు శివారు వడ్డెరగూడెంలో మంగళవారం బీజేపీ నూతనంగా ఏర్పాటు చేసిన గద్దెపై జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పలు పార్టీల నాయకులు బీజేపీలోకి రాగా వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణలో సీఎం కేసీఆర్ పాలనకు నూకలు చెల్లే కాలం దగ్గర పడిందన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు మోతీలాల్‌నాయక్, జిల్లా నాయకులు చెల్పూరు వెంకన్న, రాంబాబునాయక్, సురేందర్, మల్లయ్యగౌడ్, శ్రీశైలం, రవి, తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం సీనియర్ నాయకుడి మృతి

మహబూబాబాద్ అర్బన్ : మండలంలోని మల్యాలకు చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు జటంగి లచ్చయ్య గుండెపోటుతో మంగళవారం మృతి చెందాడు. సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, నాయకులు గునిగంటి రాజన్న, దుడ్డెల రాంమ్మూర్తి భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పరామర్శించిన వారిలో మహేష్, వెంకన్న, ఆనంద్, మహేందర్, చేపూరి గణేష్, వెంకన్న, యాదగిరి, విజయ్‌కుమార్, ఉన్నారు.

మౌలిక సౌకర్యాలు కల్పించాలి



తొర్రూరు : డివిజన్ కేంద్రమైన తొర్రూరులో మౌలిక సౌకర్యాలు కల్పించాలని తొర్రూరు ప్రాంత సమస్యల పోరాట వేదిక కన్వీనర్ తమ్మెర విశ్వేశ్వరరావు కోరారు. మంగళవారం స్థానిక లయన్స్ క్లబ్ భవనంలో తొర్రూరు ప్రాంత పోరాట వేదిక నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వేశ్వరరావు మాట్లాడుతూ ఎస్‌టీఓ కార్యాలయం, మినీ స్టేడియం, మినీ ట్యాంక్ బండ్ ఏర్పాటు చేయాలన్నారు. బాలికలకు ప్రత్యేక ఉన్నత పాఠశాల, 100 పడకల ఆసుపత్రిగా పీహెచ్‌సీని అప్‌గ్రేడ్ చేయాలని, పోస్ట్‌మార్టం సెంటర్‌ను ప్రారంభించాలని కోరారు. ఈ సమస్యలపై ఈనెల 20 నుంచి 23 వరకు ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నామన్నారు. కార్యక్రమంలో కో కన్వీనర్ అశోక్, నాయకులు వీరన్న, సాయిలు, ఎండీ.యాకూబ్, మహేందర్, లక్ష్మణ్, సుమన్, పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



దంతాలపల్లి : మండలం కేంద్రంలో భారతి విద్యామందిర్ లో 2007–08 సంవత్సరం పూర్వవిద్యార్థులు మంగళవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు పాఠశాలలో చదువుకున్న జ్ఞాపకాలను గుర్తుచేసుకొని మురిసిపోయారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురువులు నేర్పిన విద్యతో జీవిత పాఠాలు నేర్చుకొని స్థిరపడ్డామన్నారు. అనంతరం విద్య నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు.